క్లుప్తంగా

భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం



డ్రోన్ సర్వేను ప్రారంభిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నిడదవోలు రూరల్: భూ వివాదాలకు శాశ్వత పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం సమగ్ర రీసర్వే చేపట్టినట్టు తహసీల్దార్ ఎం.గంగరాజు అన్నారు. గోపవరం గ్రామంలో బుధవారం డ్రోన్ సాయంతో భూ సర్వే ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగరాజు మాట్లాడుతూ మండలంలో ఇప్పటివరకు 13 గ్రామాల్లో డ్రోన్ సర్వే పూర్తి చేశామని చెప్పారు. కచ్చితమైన సర్వేను పూర్తి చేసి పక్కా సరిహద్దులతో రైతులకు శాశ్వత భూ హక్కు పత్రాలను అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆరేపల్లి భాగ్యలక్ష్మి, ఎంపీటీసీ సభ్యురాలు కర్రి సుజాత, వైఎస్సార్ సీపీ నాయకులు ఆరేపల్లి చంటి, దొడ్డ మురీ, రీసర్వే డీటీ ఎం.నాగలక్ష్మి, ఆర్ఐ సత్యేంద్ర, మండల సర్వేయర్ పి.దిలీశ్వరరావు, సర్వేయర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బీమా సొమ్ము అందజేత

నిడదవోలు రూరల్: తిమ్మరాజుపాలెంలో ఇటీవల మృతి చెందిన నల్లి ప్రసాద్ కుటుంబ సభ్యులకు రూ.10 వేలు తక్షణ ఆర్థిక సాయం వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు అయినీడి పల్లారావు, సర్పంచ్ ముప్పిడి చంద్రశేఖర్ బుధవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు యాళ్ల రామారావు, స్థానిక నాయకులు కంబాల అంజి, దిరిసెన ప్రసాద్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు కంటి ఆపరేషన్లు

తాళ్లపూడి: హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ద్వారా పేదలకు ఉచితంగా కంటి ఆపరేషన్లు చేస్తున్నట్టు విజన్ సెంటర్ ఇన్‌చార్జి నాగరాజు తెలిపారు. తాళ్లపూడిలోని శ్రీరాజేశ్వరీ రామకృష్ణన్ లయన్స్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కంటి ఆసుపత్రి నుంచి బుధవారం 24 మందిని ఆపరేషన్ల కోసం నిడదవోలు తరలించారు. ఈ సందర్భంగా హెల్ప్ ఏజ్ ఇండియా సంస్థ ద్వారా ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందజేశారు.

భారీ అన్నసమారాధన

తాళ్లపూడి: వేగేశ్వరపురంలోని వడ్డీల రామాలయం వద్ద ఆలయ ద్వితీయ వార్షికోత్సవం సందర్భంగా బుధవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో గ్రామస్తులు, దాతల సహకారంతో ఏర్పాటు చేసిన అన్నదానంలో సుమారు 3 వేల మంది భక్తులు పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేసింది.

టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు



కిట్లు అందజేస్తున్న వైద్యాధికారి

తాళ్లపూడి: క్రమం తప్పకుండా మందులు, తగిన పౌష్టికాహారం తీసుకోవడం ద్వారా టీబీ నుంచి బయట పడవచ్చునని వైద్యాధికారి డాక్టర్ కరిష్మా అన్నారు. అన్నదేవరపేట పీహెచ్‌సీలో బుధవారం ప్రధాన మంత్రి టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నిక్షయ్ మిత్ర న్యూలాండ్ లాబొరేటరీ వారు 100 మంది టీబీ రోగులను దత్తత తీసుకుని, వారికి పౌష్టికాహారం కిట్లు అందజేశారు. రోగులకు గోధుమ పిండి, కందిపప్పు, వేరుశనగ పప్పు ఉండలు, కోడి గుడ్లు, చోడి పిండి, వంటి న్యూట్రిషియన్ ఫుడ్ అందజేసినట్టు డాక్టర్ కరిష్మా తెలిపారు. ఈ సందర్భంగా వారికి తగిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ స్వర్ణలత, సిబ్బంది పి.వి రాజు, బి.భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం

నల్లజర్ల: చోడవరం గ్రామానికి చెందిన ఈదరాడ అరుణ(22) మంగళవారం అర్ధరాత్రి నుంచి కనపడడం లేదని ఆమె తండ్రి గంగాధరరావు బుధవారం నల్లజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నరసింహ మూర్తి తెలిపారు.

దేశాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం

గోపాలపురం: దేశాభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని, రాహుల్ గాంధీని బలపరచాలని రాష్ట్ర పీసీసీ కార్యదర్శి జేష్ట సతీష్ కోరారు. కోమటికుంట గ్రామంలో బుధవారం చేయి చేయి కలుపుదాం రాహుల్ గాంధీని బలపరుద్దాం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పీసీసీ కార్యదర్శి సతీష్‌బాబు మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ 8 సంవత్సరాలుగా రాష్ట్రానికి రావాల్సిన విభజన హామీలు, ప్రత్యేక హోదా ఇవ్వకుండా ఆర్థిక ఇబ్బందులు కల్పిస్తోందన్నారు. కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ప్రత్యేక హోదాపై మొదటి సంతకం చేస్తారని ఆయన పేర్కొన్నారు. రాహుల్ గాంధీ సందేశ పత్రాలను పంచుతూ కాంగ్రెస్ నాయకులు పాదయాత్ర చేశారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు మట్టపర్తి రామమోహన్‌రావు, ఉపాధ్యక్షుడు గన్నన రామారాయుడు, బ్లాక్–1 అధ్యక్షుడు కొలూరి రతన్ రాజు, దాసరి కుటుంబరావు పాల్గొన్నారు.

సత్యసాయి జలాల పునరుద్ధరణ

- రెండేళ్ల తర్వాత పల్లెలకు గోదావరి తాగునీరు
- రూ.17 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- తొలి దశలో 112 గ్రామాలకు సరఫరా



దుద్దుకూరులోని సత్యసాయి మంచినీటి ట్యాంకు వద్ద నీరు పట్టు కుంటున్న గ్రామస్తుడు

దేవరపల్లి: గిరిజన, మెట్ట ప్రాంతాల ప్రజలకు జల ప్రసాదమైన సత్యసాయి మంచినీటి నీటి సరఫరాను ప్రభుత్వం పునరుద్ధరించింది. దాదాపు రెండేళ్ల తర్వాత పల్లెలకు గోదావరి జలాలు రావడంతో జనం ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ పథకం ద్వారా ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 173 గ్రామాలకు, తూర్పుగోదావరి జిల్లాలోని 70 గ్రామాలకు తాగునీరు సరఫరా అవుతుంది. గోపాలపురం ఎమ్మెల్యే తలారి వెంకట్రావు, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు ఈ పథకం పునరుద్ధరణ ఆవశ్యకతను ప్రభుత్వం దృష్టికి తీసుకు వెళ్లి నిధుల మంజూరుకు కృషి చేశారు.

ఇదీ పరిస్థితి

గ్రామాల్లోని బోరునీటిలో ఫ్లోరైడ్ శాతం ఎక్కువ. అలాంటి సుద్ద నీటిని తాగిన ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. ఎక్కువగా కీళ్ల నొప్పులు, కామెర్లు, కడుపునొప్పి వంటి వ్యాధులకు గురవుతున్నారు. ప్రజల ఇబ్బందులను గమనించిన సత్యసాయి ట్రస్ట్ సభ్యులు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని గోపాలపురం, పోలవరం, చింతలపూడి నియోజకవర్గాల్లోని 173 గ్రామాలు, తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరం డివిజన్‌లోని 70 గ్రామాలకు సురక్షిత తాగునీటి సరఫరా చేయాలని నిర్ణయించారు. సత్యసాయి మంచినీటి పథకం ద్వారా రూ. 500 కోట్ల వ్యయంతో మొత్తం 243 గ్రామాలకు గోదావరి జలాలను శుద్ధిచేసి పైపులైన్ ద్వారా ప్రజలకు సరఫరా చేసే కార్యక్రమాన్ని 2007లో చేపట్టారు. పట్టిసీమ వద్ద గోదావరి నదిలో ఎత్తిపోతల పథకం ఏర్పాటు చేశారు. అక్కడి నుంచి నుంచి పైపులైన్ ద్వారా గోపాలపురం మండలం హుకుంపేట వద్ద నిర్మించిన హెడ్ వర్క్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (శుద్ధి చేసే ప్లాంట్)కు నీటిని పంపింగ్ చేస్తున్నారు. ఇక్కడ శుద్ధి చేసిన నీటిని గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. మంచినీటి సరఫరాకు టెండర్లు పిలవగా ఎల్అండ్ టీ సంస్థ కాంట్రాక్ట్ దక్కించుకుంది. 14 సంవత్సరాలుగా గిరిజన, మెట్ట ప్రాంత ప్రజలు గోదావరి మంచి నీటిని తాగడంతో ఆరోగ్యవంతులుగా ఉన్నారు. దాతల సహకారంతో ప్రతి గ్రామంలో ఉచితంగా సత్యసాయి మంచినీటి ట్యాంకులు నిర్మించారు.

రెండేళ్ల క్రితం నిలిచిపోయిన పథకం

రెండేళ్ల క్రితం ఈ మంచినీటి పథకం ఆగిపోయింది. పనిచేసే సిబ్బందికి వేతనాలు చెల్లించకపోవడం, ఎల్అండ్ టీ సంస్థ కాంట్రాక్ట్ కాల పరిమితి పూర్తి కావడంతో పథకాన్ని నిలిపివేశారు. అప్పటి నుంచీ మంచినీటి కోసం 243 గ్రామాల ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. గ్రామాల్లో దాతలు నిర్మించిన ట్యాంకులు నిరుపయోగంగా ఉన్నాయి. సమస్యను రెండు నియోజకవర్గాల ఎమ్మెల్యేలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసువెళ్లగా పథకం పునరుద్ధరణకు ఆయన ఆమోద ముద్ర వేశారు.

'తూర్పు'న ఆరు మండలాలు

తూర్పు గోదావరి జిల్లాలోని గోపాలపురం నియోజకవర్గంలోని దేవరపల్లి, గోపాలపురం, నల్లజర్ల మండలాలకు సత్యసాయి మంచినీరు సరఫరా పథకం అమలులో ఉంది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని 6 మండలాలకు ఈ జలాలు సరఫరా అవుతున్నాయి. ఏలూరు జిల్లాలో 17 మండలాల్లో పథకం అమలులో ఉంది.

రూ.17 కోట్ల వ్యయంతో పునరుద్ధరణ



సత్యసాయి మంచినీటి పథకం పునరుద్ధరణకు రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 6న రూ.17 కోట్లు మంజూరు చేసింది. ఇందులో ఎలక్ట్రికల్‌కు రూ.4 కోట్లు కేట్లు కేటాయించారు. పథకం పునరుద్ధరణ, పైపులైన్ల నిర్మాణం, ట్యాంకుల మరమ్మతులకు ఏలూరు డివిజన్‌కు రూ.9 కోట్లు, రాజమహేంద్రవరం డివిజన్‌కు రూ.3.50 కోట్లు మంజూరు. ప్రస్తుతం ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలోని 105 గ్రామాలకు మంచినీరు సరఫరా జరుగుతోంది. రాజమహేంద్రవరం డివిజన్‌లోని 52 గ్రామాలకు గాను ప్రస్తుతం 35 గ్రామాలకు సరఫరాను పునరుద్ధరించాం. మిగిలిన గ్రామాల్లో పైపులైన్ల పనులు జరుగుతున్నాయి. మరో 10 రోజుల్లో అన్ని గ్రామాలకూ మంచి నీరు సరఫరా జరుగుతుంది.

– డి. బాలశంకరరావు, ఈఈ, గ్రామీణ మంచినీటి సరఫరా విభాగం, రాజమహేంద్రవరం

మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు

కొవ్వూరు: మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా కొవ్వూరు ఆర్టీసీ డిపో నుంచి 25 ప్రత్యేక బస్సులను పట్టిసీమ వీరేశ్వరస్వామి క్షేత్రానికి నడపనున్నట్టు డిపో మేనేజర్ వైవీవీఎస్ కుమార్ తెలిపారు. గురువారం స్థానిక ఆర్టీసీ డిపోలో ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజమహేంద్రవరం నుంచి కొవ్వూరు కాపవరం జంక్షన్ మీదుగా ఈ బస్సులు రాకపోకలు సాగిస్తాయన్నారు. గత ఏడాది ప్రత్యేక బస్సుల ద్వారా రూ.4.17లక్షల మేరకు ఆర్టీసీకి ఆదాయం సమకూరిందన్నారు. ఈ ఏడాది రూ.5 లక్షల వరకు ఆదాయం సమకూరవచ్చని అంచనా వేస్తున్నామన్నారు. పట్టిసీమ, కోటిపల్లి బస్టాండ్, రాజమహేంద్రవరం ఆర్టీసీ కాంప్లెక్స్, కాపవరం జంక్షన్, తాళ్లపూడి, గుటాల, కొవ్వూరులో ప్రయాణికుల సౌకర్యార్థం అదనపు సిబ్బందిని ఏర్పాటు చేస్తున్నామన్నారు.

హైస్కూళ్లకు ప్రత్యేక అధికారుల నియామకం

ఉండ్రాజవరం: పదో తరగతి విద్యార్థులకు పరీక్షల నేపథ్యంలో ప్రభుత్వం ఆదేశాల మేరకు మండలంలో ఉన్నత పాఠశాలకు ప్రత్యేక అధికారులను నియమించినట్టు మండల విద్యాశాఖాధికారి పివిఎస్.నాగరాజు తెలిపారు. చివటం, సత్యవాడ ఉన్నత పాఠశాలలకు ఏపీఎం ఎం.రత్నకుమార్, వేలివెన్ను, మోర్తలకు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసు, సూర్యారావుపాలెం, వడ్లూరులకు తహసీల్దార్ జి.కనకరాజు, ఉండ్రాజవరం, తాడిపర్రు ఉన్నత పాఠశాలలకు ఎంఈఓ పీవీఎస్ నాగరాజులను నియమించినట్టు ఆయన తెలిపారు. ఈసందర్భంగా మండల ఎంఈఓ ఆఫీసులో బుధవారం సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రత్యేకాధికారులను ప్రధానోపాధ్యాయులకు పరిచయం చేశారు. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట

- నాయీ బ్రాహ్మణుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కనకరావు
- ఆలయ ట్రస్టు బోర్డులో సభ్యత్వం కల్పించడంపై హర్షం
- ముఖ్యమంత్రి చిత్ర పటానికి క్షీరాభిషేకం



సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకంలో పాల్గొన్న నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం నాయకులు

కొవ్వూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాదయాత్ర చేసిన సమయంలో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చడంతోపాటు రాష్ట్రంలో నాయీ బ్రాహ్మణుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మల్కాపురం కనకారావు పేర్కొన్నారు. గురువారం పట్టణంలో సత్యవతినగర్‌లోని నాయీ బ్రాహ్మణ కమ్యూనిటీలో సీఎం జగన్ చిత్ర పటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాయీ బ్రాహ్మణులను దేవాలయ ట్రస్టు బోర్డు సభ్యులుగా అవకాశం కల్పిస్తూ ఆర్డినెన్స్ జారీ చేయడం అభినందనీయమన్నారు. వైఎస్సార్ సీపీ అధికారంలోకి వచ్చిన తర్వత జగనన్న తోడు పేరుతో ఆర్థిక సాయం అందించడం, షాపులకు ఉచిత విద్యుత్, కుల దూషణ నిర్మూలనకు జీవో విడుదల చేయడం ఎంతో సంతోషమన్నారు. రానున్న కాలంలో చట్టసభల్లో నాయీబ్రాహ్మణులకు అవకాశం కల్పించాలన్నారు. జనరంజక పాలన అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి మరో 30ఏళ్లు అధికారంలో ఉండడం ఖాయం అని ధీమా వ్యక్తం చేశారు. అనంతరం నాయకులతో కలిసి రాష్ట్ర హోం మంత్రి తానేటి వనితకు కృతజ్ఞతలు తెలిపారు. నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేడూరి వీర్రాజు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి కడియం శ్రీనివాసరావు, రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు మున్నంగి కిరణ్ కుమార్, కృష్ణా జిల్లా అధ్యక్షుడు నిడుమోలు ఏసుబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు ఈతకోట రమేష్, కొవ్వూరు సంఘం అధ్యక్షుడు పట్నాల శ్రీనివాసరావు, పోన్నాడ సూరిబాబు, కోడూరి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

చేపల దుకాణాల పరిశీలన

గోపాలపురం: ప్రభుత్వ అనుమతులు లేకుండా చేపల విక్రయాలు చేయరాదని కొవ్వూరు మత్స్యశాఖ ఏఈ కె.సైదానాయక్ అన్నారు. గోపాలపురంలో అనాధికారికంగా నిర్వహిస్తున్న చేపల దుకాణాలను బుధవారం ఆయన పరిశీలించారు. అనంతరం చేపలు విక్రయిస్తున్న దుకాణాదారులకు నోటీసులు జారీ చేసినట్టు చెప్పారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా అమ్మకాలు సాగిస్తే ప్రజలకు ఎటువంటి హాని కలిగినా విక్రయదారుడు భరించాలని హెచ్చరించారు. గోపాలపురంలో మత్స్యశాఖ ద్వారా గుర్తించిన ఫిష్ ఆంధ్ర షాపు యజమాని పి.మతంగమ్మకు జిల్లా సహకార కేంద్ర బ్యాంకు నుంచి ఫ్రిజ్ కొనుగోలుకు రూ.01,77,534 సబ్సిడీ మంజూరైనట్టు తెలిపారు. కొవ్వూరు మత్స్యశాఖ పరిధిలో ఉన్న 9 మండలాల్లోనూ ఫిష్ ఆంధ్ర షాపులను నెలకొల్పిన వారికి బ్యాంకు రుణాలు మంజూరు చేశామన్నారు.

ఎమ్మెల్సీ స్థానం మెట్టప్రాంతానికి కేటాయించాలి

- వైఎస్సార్ సీపీ మండల తీర్మానం

నల్లజర్ల: ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా స్థానిక సంస్థల ఎన్నికలలో ఈ సారి మెట్ట ప్రాంత నాయకులకు అవకాశం కల్పించాలని కోరుతూ వైఎస్సార్ సీపీ మండల కమిటీ తీర్మానం చేసి అధిష్ఠానానికి అందజేసినట్టు నల్లజర్ల మండల కన్వీనర్ గగ్గర శ్రీనివాస్ తెలిపారు. నల్లజర్లలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోపాలపురం నియోజకవర్గం ఎస్సీలకు రిజర్వుకావడంతో మిగతా సామాజిక వర్గాలకు ఎటువంటి రాజకీయ ప్రాధాన్యం ఉండడం లేదని, అన్ని వర్గాలకు సమన్యాయం చేస్తూ ఈసారి ఓసీలకు అవకాశం కల్పించాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ స్థానం నల్లజర్ల మండలానికి కేటాయించాలని వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తమ అభిప్రాయాలను అగ్రనేతలకు విన్నవించినట్టు చెప్పారు.

ఎమ్మెల్యే 'తలారి'కి సన్మానం



క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును సన్మానిస్తున్న నాయకులు

దేవరపల్లి: పార్టీలో కష్టపడి పని చేసిన వారికి వైఎస్సార్ సీపీ అనుబంధ కమిటీల్లో పదవులు దక్కడంపై పార్టీ శ్రేణుల్లో నూతనోత్సవం నెలకొంది. పదవులు పొందిన కార్యకర్తలు అభిమానులు, పార్టీ కార్యకర్తలకు స్వీట్లు పంపిణీ చేశారు. దేవరపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే తలారి వెంకట్రావును బుధవారం పార్టీ మండల మహిళా కమిటీ కన్వీనర్ కడలి హైమావతి, మండల సేవాదళ్ చైర్మన్ మాదవరపు వెంకటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వెంకట్రావును ఘనంగా సన్మానించారు. చిన్నాయగూడెం సొసైటీ కార్యాలయం వద్ద పార్టీ మండల కన్వీనర్ కూచిపూడి సతీష్‌ను సొసైటీ అధ్యక్షులు గడా జగదీష్ ఘనంగా సన్మానించారు. వరుసగా మూడోసారి సతీష్ మండల పార్టీ కన్వీనర్‌గా నియమితులయ్యారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీటీసీ సభ్యులు సత్తి జగదీశ్వర రెడ్డి, నిత్యానందం, గౌరీపట్నం సొసైటీ అధ్యక్షుడు గుత్తికొండ అచ్యుతరావు, మాజీ ఎంపీటీసీ సభ్యులు కడిమి రాజు, యాదవోలు ఉపసర్పంచ్ ఆరేటి సూర్యనారాయణ, పార్టీ నాయకులు ఆచంట సురేష్, గుంటుపల్లి శ్రీను, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి



విజేతలకు బహుమతులు అందజేస్తున్న మద్దిపాటి ప్రసాద్

నల్లజర్ల: విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని వైఎస్సార్ సీపీ నాయకుడు మద్దిపాటి ప్రసాద్ అన్నారు. జాగృతి కల్చరల్, లిటరరీ కాంపిటీషన్స్ పేరిట రామకృష్ణ మిషన్ 125వ వార్షికోత్సవం సందర్భంగా నల్లజర్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో విజేతలకు బుధవారం మద్దిపాటి ప్రసాద్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ స్వామి వివేకానంద బోధనలు అనుసరించి విద్యార్థులంతా దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలన్నారు. నిరంతర పఠనం విద్యార్థుల మేధాసంపత్తిని పెంపొందింపజేస్తుందన్నారు. మండలంలో వివిధ పాఠశాలల్లో దాదాపు 2,500 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నట్టు తెలిపారు. కార్యక్రమంలో విద్య కమిటీ చైర్మన్ నీరుకొండ జయకృష్ణ, హెచ్ఎం కోమతలి చిత్ర, సమరసత సేవా ఫౌండేషన్ కన్వీనర్ ఉప్పలపాటి మాధవరావు, ఉసిరిక మోహనరావు తదితరులు పాల్గొన్నారు.

రసుల్లా బేగ్‌కు డాక్టరేట్



ఎండీ రసుల్లా బేగ్‌ను సన్మానించిన దృశ్యం

నిడదవోలు రూరల్: మండలంలోని విజ్జేశ్వర గ్రామ పంచాయతీ కార్యదర్శి ఎండీ రసుల్లా బేగ్‌కు అలహాబాద్ యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. బుధవారం ఆయనను సర్పంచ్ తిక్కా శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. సూక్ష్మ జీవశాస్త్రంలో మొక్కల పెరుగుదల, రసాయన సమ్మేళనంలో జరిగిన మార్పులపై పరిశోధనలు చేయగా రసుల్లా బేగ్‌కి ఈ డాక్టరేట్ లభించింది. సచివాలయ కార్యదర్శి బి.సుబ్బారావు, వైఎస్సార్ సీపీ బద్దెల రామకృష్ణ, ఉపాధ్యాయులు సురేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గోకర్ణేశ్వరస్వామి కల్యాణం

ఉండ్రాజవరం: ఉండ్రాజవరంలో ఉన్న బాల త్రిపుర సుందరీ దేవి సమేత గోకర్ణేశ్వరస్వామి కల్యాణం గురువారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ చైర్మన్ కరుటూరి రమేష్‌కుమార్, ఈఓ మీసాల వెంకట్రావు బుధవారం తెలిపారు. స్వామి వారి కల్యాణ మహోత్సవాలల్లో భాగంగా ఐదు రోజుల పాటు వివిధ కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాట్లు పూర్తి చేసినట్టు తెలిపారు. గురువారం స్వామి వారికి అభిషేకాలు, దర్శనం, రాత్రి స్వామి వారికి బోడ్డు వెంకటరాజు దంపతులచే కల్యాణం, శుక్రవారం స్వామి వారికి అభిషేకం, అమ్మవారికి కుంకుమ పూజలు, ఏకాదశ రుద్రాభిషేకం, లక్షబిల్వార్చన, 18న ఊరేగింపు, రాత్రి చంద్రశేఖర్ సేవా సమితి ఆధ్వర్యంలో లింగోద్భవకాలంలో ఏకదశ రుద్రాభిషేకం, 19న స్వామివారి దర్శనం, లలితా పారాయణం, 20న త్రిశూల స్నానం, శ్రీపుష్పయాగం కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు తెలిపారు.

ఉద్యోగులు సమర్థవంతంగా పనిచేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో

చాగల్లు: చాగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో బి.రాంప్రసాద్ అధ్యక్షతన మండల స్థాయి కన్వర్జెన్స్ సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లాడుతూ అందరూ ఉద్యోగులు తమ పనిని సమర్థవంతంగా నిర్ణీత సమయంలోగా చేయాలన్నారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టి తీసుకొస్తే పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. అనంతరం సచివాలయ సిబ్బంది పనితీరుపై రివ్యూ నిర్వహించారు. ప్రధానోపాధ్యాయుల సమస్యలను అడిగి తెలుసుకుని వాటి పరిష్కారానికి సూచనలు చేశారు. నాడు– నేడు పనులపై సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో ఏపీఎం ఎస్.మంగాయమ్మ, సచివాలయ సిబ్బంది, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి గో అందాలు, పాల పోటీలు

- మార్కెట్ యార్డులో 3 రోజుల పాటు నిర్వహణ
- పోటీల్లో పాల్గొననున్న ఒంగోలు, పుంగనూరు జాతులు
- వివరాలు వెల్లడించిన నిర్వాహకులు



సభలో మాట్లాడుతున్న ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చక్రపాణి

ద్వారకాతిరుమల: జాతీయ స్థాయిలో ఒంగోలు, పుంగనూరు జాతి ఆవుల అందాలు, పాల పోటీలను దాతల సహకారంతో వచ్చే నెల 17వ తేదీ నుంచి 19 వరకూ స్థానిక మార్కెట్ యార్డులో నిర్వహిస్తామని ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఉప్పలపాటి చక్రపాణి తెలిపారు. ద్వారకాతిరుమల మార్కెట్ యార్డులో బుధవారం నిర్వహించిన సన్నాహక సభలో చక్రపాణి విలేకరులతో మాట్లాడారు. పోటీల్లో భాగంగా తొలిరోజు 17న ఎంట్రీలు స్వీకరిస్తామని, 18, 19న పోటీలు జరుపుతామన్నారు. అలాగే గో ఆధారిత, ప్రకృతి వ్యవసాయంపై వర్క్‌షాప్ నిర్వహిస్తామన్నారు. ఏ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తామనేది త్వరలో ప్రకటిస్తామన్నారు. ఒంగోలు జాతి నిరాధరణకు గురవుతున్న తరుణంలో ఆ జాతి అభివృద్ధికి, రైతులను ప్రోత్సహించేందుకు ఈ పోటీలు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. అంతే కాకుండా పాల ఉత్పత్తులను పెంచేందుకు ఈ పోటీలు ఎంతగానో దోహద పడతాయన్నారు. ఒంగోలు జాతి ప్రపంచంలోనే మేలైన జాతి అని, 21 దేశాల ఆర్థిక పరిస్థితి ఒంగోలు జాతిపై నడుస్తోందన్నారు. మన ప్రాంతంలో, మన గడ్డపై పుట్టిన తెలుగు వారికి చెందిన ఈ జాతిని ప్రపంచమంతా ఆదరిస్తుంటే, మనం మాత్రం నిర్లక్ష్యం చేస్తున్నామన్నారు. పర్యావరణం దెబ్బతిని, భూమి దాని ఉనికిని కోల్పోయి, రైతు తీవ్రంగా నష్టపోతున్న ప్రస్తుత తరుణంలో గోఆధారిత, ప్రకృతి వ్యవసాయం రైతులకు ఆశాజనకంగా మారిందన్నారు. అందుకే ఈ ఆవుల అందాలు, పాల పోటీలతో పాటు, గోఆధారిత వ్యవసాయ కార్యక్రమాన్ని నిర్వహించ తలపెట్టామన్నారు. పోటీల్లో పాల్గొనే రైతులు 94401 88336, 94404 34250, 95151 80491 నంబర్లకు సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక మార్కెట్‌యార్డు చైర్మన్ గన్నమని జనార్ధనరావు, ఒంగోలు, పుంగనూరు జాతుల అభివృద్ధి సంక్షేమ సంఘం రాష్ట్ర ట్రెజరర్ గోపీకాంత్ విశ్వనాథం, ప్రకృతి వ్యవసాయం జిల్లా కోఆర్డినేటర్ తాతారావు, ప్రకృతి వ్యవసాయం రీజనల్ కోఆర్డినేటర్ శివరాం, డీసీఎంఎస్ డైరెక్టర్ జంగా వెంకట కృష్ణారెడ్డి తదితరులున్నారు.

నీటిలో మునిగి ఉండే కపిల మల్లేశ్వరుడు

- మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబు



మల్లేశ్వరంలోని కపిల మల్లేశ్వరస్వామి ఆలయం

పెరవలి: వశిష్ఠ గోదావరీ తీరాన మండలంలోని మల్లేశ్వరం గ్రామంలో స్వయంభుగా వెలసిన కపిల మల్లేశ్వరస్వామి ఆలయం ఈ నెల 18న నిర్వహించే మహాశివరాత్రి ఉత్సవాలకు ముస్తాబవుతోంది. ఇక్కడి శివలింగం నిత్యం జలాదివాస దీక్షలో ఉంటుంది. ఇలా నీళ్లలో శివలింగం మునిగి ఉండడం రాష్ట్రంలో మరెక్కడా లేకపోవడంతో ఈ దేవాలయం పవిత్ర పుణ్యక్షేత్రంగా భాసిల్లుతోంది.11వ శతాబ్దంలో రెడ్డిరాజుల పాలనలో ఈ ఆలయ నిర్మాణం జరిగిందని చరిత్ర కథనం. వశిష్ఠ గోదావరి నదికి వరదలు వచ్చినపుడల్లా గర్భగుడి మొత్తం నీటితో నిండిపోతుంది. ఆ నీరు ఎలా వస్తుందో ఎలా వెళ్తుందో కూడా ఈ అంతుపట్టని విషయం. గర్భగుడి మునిగిపోయినపుడు స్వామివారికి అర్చకుడు తెప్పలో వెళ్ళి నిత్య పూజలు చేసి వస్తుంటారు. మహాశివరాత్రి ఉత్సవాలకు వచ్చే వేలాది భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లూ చేస్తున్నామని ఆలయ అభివృద్ధి కమిటీ ప్రతినిధులు తెలిపారు. దూరప్రాంత భక్తుల కోసం భోజన వసతి కల్పించామన్నారు. మధ్యాహ్నం నుంచి రథోత్సవం జరుగుతుందని చెప్పారు.

ఫ్లెక్సీల తొలగింపు

దేవరపల్లి: స్థానిక అంబేడ్కర్ సెంటర్‌కు వెళ్లే రోడ్డు మలుపులో వివిధ రాజకీయ పార్టీల నాయకులు ఏర్పాటు చేసిన నూతన సంవత్సర శుభాకాంక్షల ఫ్లెక్సీలను పంచాయతీ అధికారులు ఆదేశాల మేరకు ఆయా పార్టీల నాయకులు బుధవారం తొలగించారు. ప్రధాన రహదారికి అనుకుని ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతో రోడ్డుపై వెళ్లే వాహనాలు కనిపించక ప్రమాదాలు జరుగుతున్నాయి. ఈ విషయాన్ని 'సాక్షి' ఇటీవల ప్రచురించగా ఫ్లెక్సీలు తొలగించాలని అధికారులు పార్టీ నాయకులను విజ్ఞప్తి చేశారు. దీంతో ఫ్లెక్సీలను తొలగించారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

దేవరపల్లి: బైక్‌పై వస్తూ రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొని వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసుల కథనం ప్రకారం... త్యాజంపూడికి చెందిన గణుసుల రాము(32) బుధవారం చేపల చెరువు పనుల కోసం మోటారుసైకిల్‌పై వెళుతుండగా గ్రామంలో రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నాడు. ఈ ప్రమాదంలో రాము తీవ్రంగా గాయపడి అక్కడకక్కడే మృతి చెందినట్టు ఎస్సై శ్రీహరిరావు తెలిపారు.

స్కూటర్ చోరీ

రాజమహేంద్రవరం రూరల్: ఇంటి ముందు పార్కు చేసిన స్కూటర్ చోరీకి గురైందని మోరంపూడి బాలకృష్ణ సిరమిక్స్ ప్రాంతానికి చెందిన పడగాని కిశోర్ బుధవారం బొమ్మూరు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆయన ఈనెల 9వ తేదీ రాత్రి ఇంటి ముందు స్కూటర్‌ను పార్క్ చేశారు. తర్వాతి రోజు ఉదయం 9 గంటలకు లేచి చూసేసరికి ఆ స్కూటర్ మాయమైంది. ఎస్సై జగన్‌మోహన్‌రావు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

దిగజారుడుతనానికి దిక్సూచి టీడీపీ

- జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్



ప్రకాశం నగర్: ప్రజల చేత తిరస్కారానికి గురైన టీడీపీ.. దిగజారుడుతనానికి దిక్సూచిలా వ్యవహరిస్తోందని జిల్లా వక్ఫ్‌బోర్డ్ చైర్మన్ మహ్మద్ ఆరీఫ్ విమర్శించారు. స్థానిక జాంపేటలోని తన కార్యాలయంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై లోకేష్ చేస్తున్న వ్యాఖ్యలు టీడీపీకి మేలు చేయకపోగా, ఆ పార్టీని జనాలు మరింత చీదరించుకునే పరిస్థితి వచ్చిందన్నారు. దానినుంచి దృష్టి మరల్చడానికి చంద్రబాబు ఒక నీచమైన పుస్తక ప్రచురణతో కొత్త నాటకానికి తెరలేపారన్నారు. తెలుగుదేశం పార్టీ చేసిన దురాగతాలను ప్రచురించాలంటే ఒక్కొక్క నాయకుడికి ఒక్కొక్క పుస్తకం సరిపోదన్నారు. జగనన్న చేస్తున్న మంచిని, సంక్షేమాన్ని తెలుగు ప్రజలు తమ హృదయాల్లో చిరస్థాయిగా రచించి, నెమరు వేసుకుంటారన్నారు. కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరికీ మేలు చేసే సంక్షేమ పాలన అందించడమే ముఖ్యమంత్రి జగన్ ధ్యేయమన్నారు.